# కన్నెప్పల మాటున...

— విజయార్కె

(విలువైన జీవితాలను నిర్దయగా 'మృత్యువు'కు దగ్గరచేసే క్యాన్సర్ బూచిపట్ల ద్వేషంతో...రచయిత)

చివుక్కుమంది శ్రీకర్ మనసు.

దానిక్కారణం భార్య విద్యాధరి ప్రవర్తన.

తనే జీవితంగా, తనే ప్రపంచంగా, తను లేక తనకు ఉనికే లేదనే విద్యాధరి ఈ మధ్య తనని నిర్లక్ష్యంగా చూస్తుంది. మాటల శరాలను సంధిస్తోంది. ఈసడింపుల చురకత్తులతో తన గుండెను చీల్చి "గుండెలో వున్న తన ప్రతి రూపాన్ని పెకిలించివేస్తోంది.

ఎందుకిలా జరుగుతోంది?

తన మీద విద్యాధరికి ప్రేమ సన్నగిల్లిందా?

తనవల్ల ఏదైనా అపరాధం జరిగింది?

నా ప్రియమైన విద్యాధరీ...ఎందుకిలా చేస్తున్నావు. మరిచిపోయావా నీ ప్రేమ గురుతులు. మరిచిపోయావా నీవందించిన తీయని అనుభూతులు...? ఏవీ విద్యాధరీ. నిరుడు నీవందించిన ప్రేమ సమూహములు...


అతని మనసు సంవత్సరం వెనక్కు వెళ్ళింది.

* * *

"ఏయ్...ఏమండోయ్...ఒరే శ్రీ..."

బద్ధకంగా దుప్పటిని కాస్త కిందికి లాగి, ఎదురుగా, తలార స్నానం చేసి ఫ్రెష్‌గా తయారై, కాఫీ కప్పుతో ప్రత్యక్షమైన భార్య విద్యాధరిని చూసి

"ఏయ్...ఏమిటీ అల్లరి...భర్తని పట్టు



కుని ఏయ్...ఏమండీ...ఒరే" అంటావు. కళ్ళు పేలిపోతాయి" చిరు కోపంగా అన్నాడు శ్రీకర్. నిజానికి విద్యాధరి తననలా పిలిస్తేనే యిష్టం. భార్య వంక మురిపెంగా చూసాడు.

"ఏంచేయమంటారు శ్రీవారూ...ఇ వ్వన్నీ లేటెస్ట్ సినిమా టైటిల్స్ తోకలు..." అంది ట్రేను పక్కన పెట్టి దుప్పటి లాగి, తన చేతులతో శ్రీకర్ తలను మెల్లగా పైకెత్తుతూ.

"అబ్బబ్బ...కాసేపు పడుకోనీయ వోయ్...తెల్లవార్లూ జాగరమే చేసా నుగా...ఆమె వంక చూసి కన్నుగీటి నవ్వుతూ అన్నాడు.

"సిగ్గులేకపోతే సరి...ఆ జాగారం ఆపరేషన్‌లో నా కోపరేషన్ లేదూ..." అంది. అంతే... అలాగే ఆమెను మీదికి లాక్కున్నాడు.

పాలవాడి కేక వినిపించేంత వరకు ఇద్దరూ అలాగే వుండిపోయారు.

* * *

ఒంట్లో నలతగా అనిపించి పెంద రాళే ఇంటికొచ్చాడు ఆఫీసు నుంచి శ్రీకర్. భర్త డల్‌గా వుండడం చూసి, కంగారుపడిపోయింది విద్యా ధరి. శ్రీకర్ వారిస్తున్నా వినకుండా డాక్టర్ దగ్గరికి పరిగెత్తింది.

మరో అరగంటలో డాక్టర్‌తోసహా ఇంట్లోకి అడుగుపెట్టింది.. డాక్టర్ గారూ...ఈసారి మీకు ఏదైనా హెల్త్ ప్రాబ్లెం వుంటే, చిన్న ఫోన్ కొట్టండి. మీ ఇంటి ముందుకొచ్చి వాలుతాను. కానీ ఇలా మీ ఆవిడగారిని పంపించ కండి. నేను వచ్చేవరకు నన్ను వూపిరి కూడా పీల్చుకోనివ్వలేదంటే నమ్మండి" అన్నాడు డాక్టర్.

ఇంజక్షన్ చేసి మందులు రాసి ఇచ్చాడు.

చాలా మామూలు అనారోగ్యం. అయినా విద్యాధరి ఊర్కోలేదు. అంత రాత్రివేళ మందుల షాపుకు వెళ్ళి మందులు తెచ్చి ఆ రాత్రి మొత్తం మెలుకువగా వుండి భర్తకు సపరిచ ర్యలు చేస్తూ వుండిపోయింది.

* * *

విద్యాధరీ...నేనంటే నీకెందుకింత ప్రేమ? తనకు జ్వరం తగ్గాక అది గాదు భార్య ఒళ్ళో తల పెట్టి శ్రీకర్.

"ఏమో..." అంది తల వంచి. అతని నుదిటిమీద చిన్నగా ముద్దుపెడుతూ.

"ఒక్కసారి నీ ప్రేమ చూస్తే భయమే స్తుంది" అన్నాడు ఆమె నదుంచుట్టూ చేతులువేసి.

"ఎందుకు?"

"నీ ప్రేమ ఉధృతి నేను తట్టుకోలేను. నువ్వు...నువ్వెప్పుడు నాకు దూరంగా వున్నా తట్టుకోలేను" సిన్సియర్‌గా అన్నాడు శ్రీకర్.

"పిచ్చి శ్రీ...నాకెవరున్నారు? నీకెవరు న్నారు? ఇద్దరం అనాధలమే...నాకు నా వారెవరూ లేరు...ఎక్కడ పుట్టానో... ఎలా పెరిగానో...కూడా తెలియదు. అనాధ శరణాలయమే నాకు దేవా లయం అయింది. ఆ దేవాలయం నుంచి ఈ దేవుడి మనసనే గర్భగు డిలోకి వచ్చాను. అంది కన్నీళ్ళతో మెరిసే కళ్ళతో విద్యాధరి.

"విద్యాధరీ...నువ్వంటే నాకు బోల్డు ప్రేమ...ఏ జన్మలోనో దేవుడ్ని అతిగా పూజించి వుంటాను. దేవుడికి జాలి లాంటిదో మరే భావమో కలిగి పోనీలే అని ఈ జన్మకు వరంగా నిన్ను 'పంపి' వుంటాడు. చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయిన నేను, ఆ షాక్‌లో నుంచి తేరుకోవడానికి కొన్నేళ్ళు పట్టింది. నీకు లానే అనాధగా పెరిగాను. కష్టపడ్డాను. క్షణాలు, నిమిషాలు...గంటలూ...ప్రతి క్షణం పైకి ఎదగడానికి...నన్ను నేను బ్రతికించుకోవడానికి ఏవో సాధించడా నికి...నిరంతరం పోరాడుతూ ఈ రోజు ఈ స్థితికి చేరుకున్నా...

అయినా...విద్యాధరీ...నాలో ఏదో అసంతృప్తి...ఏదో భావం...బహుశ అభ ద్రతా భావమేమో.. .లేదా నాకె వరూ లేరనే ఒంటరితనమో...నా పోరా టంలో ఈ మనుషుల్లోని ద్వైధీ భావా లను చూసాను. మనుషుల్లోని మరో మనుషులను చూసాను. ప్రపంచమంటే స్వార్థమనే భావం...అలాంటి భావంలో నుంచి నీ ఒడిలోకి వచ్చి చేరి అభద్ర తాభావాన్ని పారద్రోలి నీ ఒడిలోని తల్లి పొత్తిళ్ళలోని భద్రతను, భార్య ఒడిలోని వెచ్చదనాన్ని పొందుతున్నాను.

విద్యాధరీ ప్రపంచంలో మంచి భార్యలు, మంచి తల్లులు వుంటారేమో కానీ, మంచి భార్య, అంతకన్న మంచి తల్లీ కలిసి ఒకరే అవ్వడం అరుదు. నీలో భార్య ప్రేమను, తల్లి మనసు తాపత్రయాన్ని చూసాను. నాకు తల్లి లేదనే దిగులు లేదు. భార్య దూర మవుతుందనే బెంగలేదు..."

అతని వాక్ ప్రవాహాన్ని వింటూ, ఆ ప్రవాహంలో తనను తాను ప్రక్షాళన చేసుకుంది విద్యాధరి!

* * *

శ్రీకర్ జీవితంలో విద్యాధరి ఒక భాగం కాదు. విద్యాధరే శ్రీకర్ జీవితం అయింది. అతని మాటలు పెదవుల సరిహద్దులు దాటక ముందే అన్నీ అమరుస్తుంది. అతనికీ చిన్నపాటి అనారోగ్యం చేసినా, తల్లిలా తల్లడిల్లిపో తుంది. మంచి భార్యగా ఊరడిస్తుంది. అతని యిష్టాలన్నీ ఆమెకు యిష్టాలే!

* * *

"శ్రీ..."

"ఏంటి విద్యాధరీ..."

"దేవుడు ప్రత్యక్షమై ఏదైనా వరం కోరుకోమంటే ఏం కోరుకుంటారు?"

"నిజం చెప్పనా? అబద్ధం చెప్పనా?"

"అబద్ధం చెప్పండి"

"భర్తల తలలపై బొడిపెలను సృష్టించే అప్పడాల కర్రలను సృష్టిం చొద్దని చెబుతాను".

"యూ...నాటీ...నిజమే చెప్పండి"

"నేనేం కోరుకుంటున్నాననుకుంటు న్నావు?"

"మురిపెంగా భర్త వంక చూసి గర్వంగా తనవంక చూసుకుని


"ఈ విద్యాధరే మళ్ళీ జన్మలో కూడా భార్య కావాలని కోరుకుం టారు" అంది.

"ఊహూ..."

విస్మయంగా చూసి అడిగింది విద్యా ధరి "మరి..."

"...నీ గర్భంలో పసిబిడ్డగా ఊపి రిపోసుకుని, నీకు బిడ్డగా పుట్టాలని కోరుకుంటాను..."

అది విస్మయమో....విభ్రాంతో...చె మ్మగిల్లిన నయనపు భాష్పపు సరికొత్త



భాష్యమో...

కన్నీరా...కదిలిపోకు...మనసా చెప్పగిల్లిపోకు...హృదయమా ఉప్పొంగి ఆనందపు అర్ణవంలో మునిగిపోకు...

"ఏమిటి...ఏమిటీ కోర్కె శ్రీ..." పిచ్చిగా అతన్ని అల్లుకుపోతూ తన కళ్ళలోని మేఘాలు హర్షమై వర్షాన్ని కురిపిస్తుండగా అడిగింది విద్యాదరి.

"అవును విద్యాధరీ...భర్తగా ఈ జన్మలో నీ రుణం తీర్చుకునే అవకాశం నాకివ్వడం లేదు. నువ్వే నా సర్వం అయిపోయావు. కనీసం వచ్చే జన్మలోనైనా నీ బిడ్డనై, ఈ జన్మలో దూరమైన తల్లి పొత్తిళ్ళలోని అనుభూతి, తల్లి స్తన్యంలోని అనురాగ ధారనీ, తనివితీరా అనుభవించి, బిడ్డగా నీ రుణం తీర్చుకోవాలని వుంది".

భావానికి లిపి లేనప్పుడు...భాష్యానికి హద్దు లేనప్పుడు...ఆ యిద్దరి మధ్యా నిశ్శబ్దమే...ఘనీభవించింది, స్తంభించింది.

* * *

"హలో...మిమ్మల్నే...ఏమిటి ఎవరైనా గాళ్‌ఫ్రెండ్ గుర్తుకొచ్చిందా? విద్యాధరి మాటలతో ఉలిక్కిపడి కన్నీళ్ళు తుడుచుకుని "ఏమిటన్నట్టు చూసాడు విద్యాధరి వైపు."

"ఆఫీసుకు వెళ్ళేది వుందా? లేదా? ఇదిగో ఈ మెడ చూడండి. లేబర్ వాళ్ళ మెడ వున్నట్టు బోసిగా లేదు. ఓ నెక్లెస్ తీసుకు రావచ్చుగా...ఎందుకు తీసుకొస్తారులెండి...ఆ నెక్లెస్ ఏ గాళ్‌ఫ్రెండ్‌కో యిస్తే కనీసం ఓ రాత్రయినా సంతోషపెడుతుందేమో..."

చెళ్ళున ఛర్నాకోల కొట్టిన ఫీలింగ్.

"అదేమిటి ధరీ...పెట్టెలో బోల్డు గోల్డ్ ఆర్నమెంట్స్ వున్నాయి. కావాలంటే నీ యిష్టమున్న నెక్లెస్ తెచ్చుకో... బీరువాలో డబ్బు వుందిగా."

"అంటే నేనే వెళ్ళి తెచ్చుకోవాలి...మొగుడిగా నీకు బాధ్యత లేదా? సూటిగా అడిగింది విద్యాధరి.

ఓ ముల్లు హృదయాన్ని కెలికిన ఫీలింగ్ కలిగింది.

"విద్యాధరి నీ కోసం ఈ గోల్డ్ రింగ్ అంటే, అదేమిటండీ, నిలువెత్తు బంగారంలా మీరుంటే అని సున్నితంగా గోల్డ్ రింగ్‌ను తిరస్కరించి తనని అల్లుకుపోయిన విద్యాధరి.

తల విదిల్చాడు.

"ఆఫీసుకెళ్తున్న విద్యాధరీ...సాయంత్రం త్వరగా వస్తాను. రెడీగా వుండు. పిక్చర్‌కు వెళ్దాం..."

"నా మొహానికి అదొక్కటే తక్కువ..." అంటూ లోపలికి వెళ్ళి దఢాలున తలుపేసుకుంది. తను ఆఫీసుకు వెళ్తుంటే ఇదిగో విటమిన్ ఎం అంటూ నుదిటిమీద ముద్దు పెట్టుకునికానీ ఆఫీసుకు పంపించని విద్యాధరి ఈ ప్రవర్తన ఎందుకిలా...?

* * *

ఆఫీసులో ఏ పనీ చేయబుద్ధి కాలేదు. రోజు రోజుకీ విద్యాధరిలో వస్తోన్న ఈ మార్పుకు కారణం ఏమిటో అర్థం కావడం లేదు. ఒక్కసారి విద్యాధరి మీద కోపం కూడా వస్తుంది. ఆమె ప్రవర్తనవల్ల హర్ట్ అయి ఆమెను ద్వేషించే స్థాయికి వెళ్తుంది అతని మానసిక స్థితి.

ఫైళ్ళన్నీ 'పెండింగ్' లిస్టులో చేరిపోయాయి.

"గుడ్మార్నింగ్ సార్..." స్టెనో స్టెల్లా ఛాంబర్‌లోకి వచ్చి విష్ చేసింది.

"గుడ్మాణింగ్" అన్నాడు ముభావంగా.

"ఎనీ ప్రాబ్లమ్ సర్...ఇఫ్ యు డోంట్ మైండ్...మీ పర్సనల్ అయితే వద్దులెండి" అంది అతనికి దగ్గరగా వచ్చి.

స్టెల్లా వైపు చూసాడు. తన దగ్గర పనిచేసే స్టెనో పెళ్ళయి వెళ్ళిపోవడంతో అప్పట్లో దగ్గరుండి ఇంటర్వ్యూలోనే కండక్ట్ చేసి స్టెల్లాను సెలక్ట్ చేసింది విద్యాధరి.

"స్టెల్లా వైపు చూసాడు. ఈ మధ్య తనకు దగ్గరవ్వాలని ప్రయత్నిస్తుంది. అది తన నోటీస్‌లోకి వచ్చింది. అయినా పెద్దగా పట్టించుకోలేదు. అయితే ఆమె చూపించే ఎఫెక్షన్, యింట్లో విద్యాధరి ప్రవర్తన...రెండూ కంపేర్ చేస్తే స్టెల్లా తనకు దగ్గరవుతున్నట్టనిపించింది.

"రిలాక్స్ సర్..." అంది శ్రీకర్ దగ్గరికి వచ్చి అతని తలమీద చేయివేస్తూ.

అప్రయత్నంగా ఆమె పొట్ట మీద తలపెట్టి కళ్ళు మూసుకున్నాడు.

స్టెల్లా కళ్ళనీళ్ళు సుడులు తిరిగాయి. తనకి బాధ్యత అప్పగించిన విద్యాధరి గుర్తుకు వచ్చి సన్నగా వణికిపోయింది.

* * *

శ్రీకర్ యింటికి వచ్చేసరికి ఇంటికి తాళం వేసి వుంది. శ్రీకర్ ఆఫీసుకు వెళ్ళిపోగానే విద్యాధరి కారులో ఎక్కడికో వెళ్ళిపోయిందని గూర్ఖా చెప్పాడు.

ఏ అర్థరాత్రికో తిరిగి వచ్చింది.

ఎక్కడికి వెళ్ళావని శ్రీకర్ అడగలేదు.

ఎందుకు వెళ్ళానో విద్యాధరి చెప్పలేదు.

శ్రీకర్ బాధను ఆ రోజు అర్థరాత్రి వరకు వుండి స్టెల్లా ఓదార్చింది. విద్యాధరి బాధను. ..అక్కడ డాక్టర్...

* * *

"ఏమిటది విద్యాధరీ...మీ ఆలోచన ఏమీ బాగాలేదు. అడ్వాన్స్ స్టేజీ కూడా దాటిన మీరు. ..క్యాన్సర్‌తో పోరాడే శక్తిని కూడా కోల్పోయి, మరణానికి చేరువలో వుండి... డ్రమెటిగ్గా ఈ నాటకం ఎందుకు? శ్రీకర్‌తో నిజం చెప్పండి...మీ తిరస్కారం శ్రీకర్ భరించలేదు. మీ ఫ్యామిలీ డాక్టర్‌గా చెబుతున్నాను. ఆ రోజు శ్రీకర్‌కు మామూలుగా ఒంట్లో నలతగా వుంటేనే అంతలా చలించిపోయిన మీరు ఈ రోజు...ఫ్యామిలీ డాక్టర్ బాధగా అంటున్నాడు విద్యాధరితో.

"కొన్ని జీవితాలు నాటకీయంగా, ముగిసిపోతేనే బావుంటుంది డాక్టర్... శ్రీకర్ మనసు నాకు తెలుసు. అతను ద్వేషాన్ని ఎదురించి, అసహ్యించుకుని, ఆ వ్యక్తికి దూరంగా వుండగలడు కానీ, ప్రేమను మరిచిపోయి, ఆ వ్యక్తి జ్ఞాపకాలను మరిచిపోలేడు. దేవుడు కూడా మాతో 'ఆట' ఆడుతున్నాడు. మామూలు అనారోగ్యం అనుకున్న నాకు క్యాన్సర్ అని, అదీ చివరి క్షణాల్లో వున్న స్టేజీ అని తెలిసాక, ఆ నిజం శ్రీకర్‌తో చెప్పలేను. నాలో భార్యని, నా ప్రేమలో అమ్మను చూసుకుంటున్న అతడికి నేనిక కొద్ది రోజులే బ్రతుకుతాను సుమా...అని చెబితే కొద్ది క్షణాలు కూడా అతను బ్రతకలేడు. సినిమాల్లో యిలాంటి సంఘటనలను మెలోడ్రామా అనుకునేదాన్ని. కానీ ఇది జీవితం డాక్టర్...నా మీద ద్వేషం... అతనికి బ్రతుకు మీద కొత్త ఆశలను సృష్టించాలి. అతను స్టెల్లాకు దగ్గరవ్వాలి...నా జ్ఞాపకాన్ని దాని తాలూకు ఉనికిని కూడా భరించలేని స్థితికి వెళ్ళాలి. అలా అతణ్ని మార్చి మార్చి నా చివరి క్షణాలను అతనికి అంతుబట్టని రీతిలో ముగిస్తాను. అతనికి చెప్పకుండా ఎక్కడికో వె...ళ్ళి... పో...తా..." ఆమె మనసు వెల్ మాటలుగా వింటోన్న డాక్టర్ చలించిపోయాడు.

ఇలాంటి భార్యలకు ఏ వైద్య విజ్ఞానమూ మందులను కనిపెట్టలేదు. ఏ మేధస్సూ శస్త్ర చికిత్స చేయలేదు. గుండెను మార్చే తన విజ్ఞానం మనసును ఓదార్చలేదు. దేవుడా క్యాన్సర్‌కు మందు కనిపెట్టవూ...విజ్ఞానమా...ఎదుగు...ఎదిగి ఈ మనసుకు శస్త్రచికిత్స చేసే యంత్రాలను కనిపెట్టు... అతను డాక్టర్...అయినా దేవుణ్ని వేడుకుంటున్నాడు.

* * *

తన మీద ద్వేషం...తన తీపి జ్ఞాపకాలను దహించి శ్రీకర్‌కు కొత్త జీవితం పట్ల ప్రేమను కలిగించాలి. లేకపోతే అనుక్షణం తన జ్ఞాపకాలే ఊపిరిగా బ్రతుకుతూ జీవచ్ఛవంగా వుంటాడు.

ఆమె కనురెప్పల మాటున...అంతుచిక్కని, అర్థ్రతకు అందని ఏ భావమో... ఘనీభవించిపోయింది. ఏదో ఓ క్షణం ఈ నిజం...ఆమెను మృత్యువు రూపంలో తీసుకెళ్తుంది.

ఆ క్షణం ఆమె కనురెప్పల మాటున దాగిన ఈ నిజం...అతనికి చేరుతుందో లేదో కానీ కాలానికి వీళ్ళతో వీళ్ళ భావాలతో పని ఏమిటి? అది సాగిపోతూనే వుంటుంది.

శ్రీకర్ విద్యాధరినీ ప్రేమిస్తూ, ఆమె ప్రేమలోని ద్వేషాన్ని భరించలేక, ఆమెను ద్వేషిస్తూనే వున్నాడు.

విద్యాధరి శ్రీకర్‌ని ద్వేషిస్తూ (ద్వేషం నటిస్తూ) ఆ ద్వేషం వెనుక వున్న తన ప్రేమను, తన కనురెప్పల మాటున వున్న కన్నీళ్ళలో సమాధిచేస్తూ మృత్యువు కోసం ఎదురు చూస్తూనే వుంది. కొన్ని కథలకు ముగింపు వుండదు... వున్నా...మన వూహలకు అందదు. అలాంటిదే ఈ కథ.

★